క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు విసి ఆనందరావు , శౌరీలురెడ్డి, తదితరులు

ఆర్‌యు మహిళా క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

కర్నూలు సుంకేసుల రోడ్లోని సైంట్ జోసెఫ్ కళాశాలలో శనివారం ఆర్‌యు యూనివర్సిటీ స్థాయి మహిళా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనందరావు , క్రీడల సిఇఒ రమణ పాల్గొన్నారు. కెడిసిడిఆర్ విమెన్ మెంబెర్ నసీమ కౌసర్ , యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ శివ కిశోర్ పాల్గొన్నారు. విసి.ఆనంద రావు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా వున్నారన్నారు. క్రీడల్లో కూడా చక్కగా రాణించాలన్నారు. క్రీడాకారులు క్రీడలను తమలో అంతర్భాగం కావాడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందుతారన్నారు. సింధు, కరణం మల్లీశ్వరి , నికత్ జరీన్, సైనా నెహ్వాల్‌లా రాణించాలని సూచించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలకు సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజి ఆతిధ్యం ఇస్తున్నట్లు కళాశాల డీన్ శౌరీలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత , ఆర్గనైజింగ్ సెక్రటరీ ,వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. హాండ్ బాల్ లో సెయింట్ జోసెఫ్ మహిళ కళాశాల పై సెయింట్ జోసెఫ్ కళాశాల 2-0 స్కోర్ తో విజయం సాధించింది. ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల ఎమ్మిగనూరు పై ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాజల ఆదోని 4-0 స్కోర్ తో విజయం సాధించింది. వాలీ బాల్ లో ఆర్ కాలేజ్ కర్నూల్ పై సెయింట్ జోసెఫ్ కాలేజ్ 24 -16 , 24- 12 , గెలుపొందినది , సెయింట్ జోసెఫ్ కాలేజ్ పై బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజ్ నందికొట్కూరు 25- 12 ,25- 24 స్కోరుతో గెలుపొందింది.

అందని వేతనాలు...

- ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు - కొన్ని శాఖలకు మూడు నెలల దాటుతున్న వైనం
- ప్రభుత్వం తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతినెలా ఉద్యోగులకు వేతనాలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. వేతనాలు సక్రమంగా అందకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని శాఖల ఉద్యోగులకు ప్రభుత్వం మూడు నెలలకోసారి వేతనాలను విడుదల చేసింది. ఉపాధ్యాయులకు నెల మధ్యలో వేతనాలు విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు జిల్లాలో మొత్తం దాదాపు 15 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో దాదాపు 5 వేల మంది ఉద్యోగులు విధులను నిర్వహిస్తున్నారు. ప్రతినెలా 1న వేతనాలను విడుదల చేయకుండా ప్రభుత్వం ఆలస్యం చేస్తోంది. నెల ప్రారంభమై వారం రోజులు ముగుస్తున్నా ఇప్పటివరకు అనేక శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు విడుదల కాలేదు. పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖలకు చెందిన ఉద్యోగులకు మినహాయిస్తే మిగిలిన వారికి మాత్రం 10వ తేదీ తర్వాత వేతనాలు అందుతున్న పరిస్థితి ఉంది. ఉపాధ్యాయుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం నెలలో రెండు లేదా మూడో వారంలో చెల్లిస్తోంది. ఉపాధ్యాయులు ప్రతినెలా వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వేతనాలు సకాలంలో అందకపోవడంతో బ్యాంకుల్లో చేసిన అప్పులకు ఇఎంఐలు కట్టలేక ప్రతినెలా ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో వీరికి సిబిల్ స్కోర్ తగ్గడంతో పాటు మిగిలిన బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అనేకమంది ఉపాధ్యాయులు బయట ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చుకొని కుటుంబాలను గడుపుతున్నారు. ఇటీవల కాలంలో విద్యాశాఖలో మండల విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు పొందిన వారికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇప్పటివరకు వీరి వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉంది. ప్రభుత్వ శాఖల్లో పరిస్థితి ఇలా ఉంటే ఆయా పథకాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పని చేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలకోసారి వేతనాలు అందుతున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఎప్పుడు విడుదలవుతాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు, కెజిబివి బోధన, బోధనేతర సిబ్బందికి మూడు నెలలైనా వేతనాలు విడుదల కాలేదు. ఉద్యోగుల వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యాక్సెప్టెన్స్ టెస్ట్ పక్కాగా నిర్వహణ : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా యాక్సెప్టెన్స్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళిని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని ఇవిఎం గోడౌన్‌లో బెల్ ఇంజినీర్లచే నిర్వహిస్తున్న యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. జెసి మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు కేటాయించి కొత్తగా వచ్చిన 7,020 బ్యాలెట్ యూనిట్లు, 5,460 కంట్రోల్ యూనిట్ లను ఇవిఎం గోడౌన్‌లో భద్రపరచి బెల్ ఇంజనీర్ల ద్వారా యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమం మొత్తం ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళికి సూచించారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళితో పాటు బెల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల కష్టాలు వినేదెవరు..?

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల పేరుతో కర్నూలు నగరంలో రెడ్డి ఏజెన్సీ వారు 91 క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసి 98 మంది డ్రైవర్లను తీసుకున్నారు. వారిలో 45 మందికి 4 నెలల నుంచి 10 నెలల వరకు, అందరికీ కామన్‌గా 3 నెలలు జీతాలు ఇవ్వలేదు. జీతాలు ఇప్పించాల్సిన మున్సిపల్ కమిషనర్ మాకు సంబంధం లేదని, జీతాలు అడిగితే పని నుంచి తొలగిస్తామంటున్నారు. అగ్రిమెంట్‌లో ఉన్న ప్రకారం జీతం, పిఎఫ్, ఇఎస్ఐతోపాటు కార్మిక చట్టాలు అమలు చేయాలని కార్మికులు కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే తాము సమ్మెకు వెళ్తామని హెచ్చరించినా స్పందించలేదు. ఈఏడాది ఆగస్టు 11 నుంచి ఆందోళనలు, సమ్మె చేశారు. పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ధర్నాలు, ప్రదర్శనలు, అర్ధనగ్న ప్రదర్శనలు, ఊరేగింపులు, జగనన్నకు చెబుదాం స్పందనలో వినతులు ఇచ్చారు. ఇన్ని రకాల నిరసనలు తెలిపినా ఎవరూ స్పందించరేంటీ..?, వారేమి గొంతెమ్మ కోరికలు కోరలేదు. ఇంటింటికి తిరిగి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు తరలించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. వారికి కనీస వేతనం కూడా కాదు. ఒప్పందం ప్రకారం జీతం, ఇఎస్ఐ, పిఎఫ్ ఇవ్వమన్నారు. ఏడాది నుంచి కట్టింగ్ చేసిన పిఎఫ్ డబ్బులను వారి అకౌంట్‌లో జమచేయమన్నారు. కార్మికుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వకుంటే బదికేదెలా..? జనంతో చెత్త పన్ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారే... దాని నుంచి ఇవ్వడానికేంటి.? నిజంగా కర్నూలు నగరపాలకులు మనుషులైతే స్పందిస్తారని ఆశిద్దాం...

నిరసనాగ్రహం : ఉత్తరప్రదేశ్ లిఖింపూర్‌లో నలుగురు రైతుల హత్యకు కారకుడైన కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ప్రధాన కారకుడని వెంటనే కేంద్ర మంత్రిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఒకరోజు బ్లాక్ డే నిర్వహించారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్లు అన్ని మండలాల్లోని తహశీల్దార్ల కార్యాలయాల ముందు నిరసన తెలిపారు.

ఢిల్లీలో న్యూస్ క్లిక్ మీడియా కార్యాలయాలపై పోలీసులు, ఎన్ఐఎ సోదాలు, పోలీసుల దాడి, అరెస్టును ఖండిస్తూ జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలను ఎండగట్టారు.

ఆవిర్భావ దినోత్సవం : కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కెవిపిఎస్ కార్యాలయాల ముందు, వివిధ కూడళ్లలో జెండాను ఎగురవేశారు. ఇప్పటి వరకు కెవిపిఎస్ సాధించిన విజయాలను, సామాజిక ఉద్యమాలను నెమరేసుకున్నారు.

మహాత్మ గాంధీ స్ఫూర్తితో : మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు లలిత కళా సమితిలో వర్తమాన పరిస్థితులు – మత సామరస్యం – ఆవశ్యకత అంశంపై సదస్సు నిర్వహించారు. గాంధీ స్ఫూర్తితో మతసామరస్యాన్ని చాటాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు.ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు.

బాబుకు తోడుగా మేము సైతం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసులను ఎత్తేయాలని ఈ వారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నాయకత్వంలో 14 నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బాబు తోడుగా 'మేము సైతం' పేరుతో టిడిపి శ్రేణులు రిలే నిరసన దీక్షలు చేస్తున్నాయి. ఆయా ప్రాంతాలలో వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు.

జగనన్న ఆరోగ్య సురక్ష : జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం కార్యక్రమాలు చేపడుతుంది. ఆయా సచివాయాల పరిధిలో అన్ని రకాల పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ప్రచారం చేస్తున్నారు.

క్లాప్ ఆటో కార్మికుల ఆకలి కేకలు ఆపండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లను డ్యూటీలోనికి తీసుకోవాలని పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ళ విజయ (రామాంజనేయులు) అధ్యక్షతన కార్మిక కర్షక భవన్ లో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అక్బర్ హుస్సేన్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి వినోద్ చౌదరి, సిపిఐ నగర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, ఆమ్ ఆద్మీ పార్టీ నగర అధ్యక్షులు షకీల్ ఖాన్, టిడిపి నగర నాయకులు ఏసన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, సాయిబాబా, నరసింహులు మాట్లాడారు. స్వచ్ఛభారత్ పేరుతో దేశాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరున రాష్ట్రాన్ని స్వచ్ఛంగా ఉంచాలనే ఉద్దేశం మంచిదే కాని దానికోసం పనిచేసే కార్మిక కుటుంబాలు ఆకలితో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి నాయకుల బినామీ పేరుతో ఉన్న రెడ్డి ఏజెన్సీకి 33 మున్సిపాల్టీలను అప్పగించి అగ్రిమెంటు చేశారని, కర్నూలు నగరంలో కూడా రెడ్డి ఏజెన్సీ వారు 91క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసి 98 మంది డ్రైవర్లను తీసుకున్నారన్నారు. వారిలో 45 మందికి 4 నెలల నుండి 10 నెలల వరకు, అందరికీ కామన్‌గా 3 నెలలు జీతాలు ఇవ్వకుండా పెండింగులో ఉంచారన్నారు. జీతాలు ఇప్పించాల్సిన మున్సిపల్ కమిషనర్ ఇప్పించకుండా, మీ జీతాలు మాకు సంబంధం లేదని, జీతాలు అడిగితే పని నుండి తొలగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అగ్రిమెంట్లో ఉన్న ప్రకారం జీతం, పిఎఫ్, ఇఎస్ఐ తోపాటు కార్మిక చట్టాలు అమలు చేయాలని కార్మికులు కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఈ సమస్యలు పరిష్కరించకపోతే తాము సమ్మెకు వెళ్లవలసి వస్తుందని విన్నవించుకున్నా పట్టించుకో లేదని విమర్శించారు. కర్నూలు కార్మిక శాఖ అధికారికార్మికుల సమస్యలపై జోక్యం చేసుకొని రెడ్డి ఏజెన్సీ వారిని, కార్మిక నాయకులను పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇప్పించి కార్మికులతో సమ్మె విరమింపచేశారని అన్నారు. కార్మిక శాఖ అధికారి చొరవతో కార్మికులు పనిలోనికి వెళ్లడానికి సిద్ధపడితే మున్సిపల్ కమిషనర్ క్లాప్ ఆటోలు కార్మికులు నాకు అవసరం లేదని భీష్మించుకొని కూర్చోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. క్లాప్ ఆటో డ్రైవర్లతో పని చేయించుకుంటే కర్నూలు నగర ప్రజలకు మలేరియా, టైపాయిడ్ వైరల్ జ్వరాలతో అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి వచ్చేది కాదన్నారు. కార్మికులలో 17 మందిని తొలగిస్తామని, పెండింగ్ జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐలు నన్ను అడగకూడదని, లేదంటే మిమ్మల్ని మొత్తంగానే తొలగిస్తామని భయపెడుతూ పైశాచిక ఆనందం పొందడం బాధాకరమన్నారు. కమిషనర్ ఒక ఐఎఎస్ ఆఫీసర్ అయిఉండి చట్టాలు అమలు చేయకుండా నియంతలా వ్యవహరించడం పద్ధతి కాదన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు, నగర మేయర్, కార్పొరేటర్ల చుట్టూ కార్మికులు తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదంటే నమ్మశక్యం కావడం లేదన్నారు. వారిని వెంటనే పనిలోకి తీసుకోకపోతే క్లాప్ ఆటో కార్మికులకు మద్దతుగా అన్ని పార్టీలతో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్మిక ప్రజా సంఘాల నాయకులు సుధాకరప్ప,మహ్మద్ రఫీ,క్లాప్ డ్రైవర్ లందరూ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న గౌరు దంపతులు, టిడిపి నాయకులు

కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబు అరెస్ట్‌కు నిరసన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం రాత్రి 7 గంటలకు గౌరు దంపతుల స్వగహంవద్ద కాంతితో క్రాంతి కార్యక్రమంలో భాగంగా టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి , లైట్లు ఆఫ్ చేసి, సెల్ ఫోన్లు, కొవ్వొత్తులు వెలిగించి 5 నిమిషాల పాటు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి కళ్ళు బైర్లు కమ్మేలా టిడిపి శ్రేణులతో కలిసి నిరసనగా సంఘీభావం తెలియచేశామన్నారు.

కళ్ళుండి చూడలేని కబోది ప్రభుత్వం

కర్నూలు క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం కళ్ళుండి చూడలేని కబోది అని కోడుమూరు నియోజకవర్గ యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి జిల్లా సీని యర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి నేతత్వంలో కర్నూలు మండలం పసుపుల గ్రామంలో రాత్రి 7 గంటలకు కొవ్వొత్తి కాంతి ప్రదర్శన చేపట్టారు.

కొవ్వొత్తులతో బొగ్గుల దస్తగిరి నిరసన

బాబు అరెస్టుకు నిరసనగా టిడిపి కార్యకర్తల దీక్ష

సి బెళగల్ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి మండల కన్వీనర్ గోవింద్‌గౌడ్, సి.బెళగల్ మాజీ సర్పంచి చిన్న మునెప్ప, గూడూరు సుందర్ రాజు తదితర నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ సర్కిల్‌లో దీక్ష చేపట్టారు.

డిఆర్‌డిఎ పిడిగా సలీం బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా సలీం బాషా నియామక ఉత్తర్వులను సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ జారీ చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా నీటి యాజమాన్య సంస్థలో వాటర్ షెడ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్గా విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డిఆర్‌డిఎ ఇన్‌చార్జి పిడిగా, మెప్మా పిడిగా నాగ శివ లీల వ్యవహరిస్తున్నారు. వాటర్‌షెడ్ అడిషనల్ పిడిగా రిలీవ్ ఉత్తర్వులను అందజేశారు.

9న కలెక్టరేట్లో స్పందన

కలెక్టరేట్ : ఈనెల 9న కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన ఉంటుందని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

గొర్రెలు,మేకల పెంపకానికి 50శాతం సప్సిడీ

-జాతీయ లైవ్ స్టాక్ మిషన్ జిల్లా స్థాయి అవగాహన సదస్సు-రైతులకు అన్నిరకాల సబ్సిడీలను అందించాలి
-జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి అవగాహన సదస్సు పెద్దపాడు సమీపంలోని పుష్పరాజ్ ఫంక్షన్ హాలులో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామ చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మహేశ్వర రెడ్డి, కర్నూలు జిల్లాగొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షులు వై.నాగేశ్వం రావు యాదవ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్వి.జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ గొర్రెల, మేకల యూనిట్లు 50శాతం సబ్సిడీతో ఇస్తున్నారని వీటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బ్యాంకు ద్వారా వచ్చే సమస్యలను బ్యాంకర్స్ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించడానికి కషి చేస్తానని అన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు బి.మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ మిషన్ ను గొర్రెలు, మేకలతో పాటు, కోళ్ళు , పందుల పెంపకానికి కూడా 5శాతం సప్సిడి అందజేస్తామన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ఈ సదస్సుకు హాజరు అయిన 650 మంది పశు పోషక రైతులకు ప్రొజెక్టర్ ద్వారా కోళ్ళు,గొర్రెలు, మేకలు, పందులు, వివిధ జీవాల వల్ల ఎలాంటి లాభాలు సప్సిడీలు వర్తిస్తాయనేది అవగాహనను కల్పించారు. కర్నూలు , నంద్యాల బహుళార్ధ పశువైద్యశాలల వారు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గొర్రె ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు, సభ్యులు , రైతుభసా కేంద్రం సలహా మండలి సభ్యులు, ఔత్సాహిక రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కల్లూరు ఎఒ అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కల్లూరు మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి పై తక్షణమే సమగ్ర విచారణ విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కల్లూరు మండలం కార్యదర్శి ఎ.కృష్ణ, ఎపి రైతు సంఘం కర్నూలు మండలం కార్యదర్శి మృత్యుంజయ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక కర్షక భవన్లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీనివాసరెడ్డి రాజకీయ నాయకుల అండ చూసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతి హద్దు మీరిందన్నారను. కల్లూరు మండలంలో నకిలీ విత్తనాలు స్వైర విహారం చేస్తున్నాయంటే ఆయన చలువేనని, కావలసినంత ముడుపులు తీసుకుని యథేచ్ఛగా అమ్ముకోవడానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. ఇటీవల రాఘవేంద్ర సీడ్స్ షాపులో కాలం తీరిన మిరప విత్తనాలు ఉల్చాల రైతుకు అమ్మగా వెంటనే డిఎఒకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేయగా కల్లూరు ఎఒను విచారణకు ఆదేశించారన్నారు. శ్రీనివాసరెడ్డి సదరు షాపు దగ్గరికి పోయి వారితో మంతనాలు జరిపి నకిలీ విత్తనాలు అనే విషయం తప్పుడు సమాచారమని ఆయన డిఎఒకు నివేదిక ఇచ్చారు. విషయం పత్రికలలో కూడా ప్రచురితమైంది. నకిలీ విత్తనాలు కాలం చెల్లిన విత్తనాలు అమ్మినవారికి ఆయన సహకారం ఎలా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చున్నారు. సదర్ షాపు వారు కాలం చెల్లిన విత్తనాలు అమ్మిన పరిస్థితి మరొకసారి జిల్లా అగ్రికల్చర్ ఆఫీస్ అధికారులకు రైతు విన్నవించగా ఎడి శాలిరెడ్డి మరొకసారి విచారణ నిమిత్తం పంపగా కాలం చెల్లిన విత్తనాలు అమ్మినారని నిర్ధారణ చేసి ఆ షాపును సీజ్ చేవారన్నారు. ఇదొక ఉదాహరణ చాలు ఆయన ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడో తెలియడానికి ఫర్టిలైజర్స్ షాపుల దగ్గర మామూలు ఏ రకంగా వసూలు చేస్తున్నాడో చెప్పవలసిన అవసరం లేదన్నారు. అంతేకాక రైతుల పట్ల అహంభావపూరితంగా మాట్లాడతాడని మండలంలోని రైతులు అనేకమంది వాపోతున్నారన్నారు. ఆయనకు రాజకీయ పలకబడి ఉండడం వలన రైతులు ఫిర్యాదు చేయడానికి జంకుతున్నారన్నారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని కల్లూరు ఎఒ శ్రీనివాసరెడ్డి పై సమగ్రమైన విచారణకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. శ్రీనివాసరెడ్డికి వచ్చే ఆదాయం ఆయన కున్న ఆస్తులపైన విచారణ జరిపితే ఆయన అవినీతి అక్రమాలు బయటపడతాయని కోరారు. ఎఒ శ్రీనివాస్ రెడ్డిని కల్లూరు మండలం నుండి బదిలీ చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు

మాట్లాడుతున్న రామకృష్ణ

కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

25 కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్ శనివారం 25 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. నగరంలో పేద ముస్లిం మహిళలకు స్థానిక మహమ్మదీయ వక్ఫ్‌బోర్డు కాంప్లెక్స్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ అన్నారు. షాగుప్త టైలరింగ్ సెంటర్, మద్రాస సాధ్యనిస్వాన్ టైలరింగ్ సెంటర్, రయాన్ మస్జిద్ జోహారాపురం టైలరింగ్ సెంటర్, బుధవార్ పేట్ రిజ్వానా టైలరింగ్ సెంటర్లకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముస్లిం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కర్నూలు నగరంలో ముస్లిం సోదరులకు ఉపయోగపడే విధంగా వక్ఫ్ బోర్డ్ వారి సహకారంతో వివిధ సేవా కార్యక్రమాల కోసం వాహనాలను కొనుగోలు చేశామని, మరింత సేవ లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా మైనారిటీ అధికారి, వైసిపి మైనార్టీ నాయకులు, కో ఆప్షన్ మెంబర్, జిల్లా హజ్ కమిటీ డైరెక్టర్, ఉర్దూ అకాడమిక్ డైరెక్టర్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల పంపిణీ పై నోరు విప్పని వైసిపి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కృష్ణా జలాల పంపిణీలో రాయలసీమకు అన్యాయం జరుగుతున్నా నాలుగున్నర ఏళ్లుగా నోరు విప్పని వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సీమద్రోహిగా చరిత్రలో మిగిలారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ ఆరోపించారు. శనివారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి, మల్లెల రాజశేఖర్ గౌడ్, బివి. జయ నాగేశ్వరరెడ్డి, నాగేశ్వరరావుయాదవ్ లతో కలిసి బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడారు. ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటివరకు కృష్ణా జలాల పంపిణీపై ఏనాడూ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించలేదన్నారు. న్యాయమైన వాటా కావాలని అడిగిన పాపాన పోలేదన్నారు. ప్రధానిని, జలశక్తి మంత్రిని కలిసి కోరినా దాఖలాలు లేవన్నారు. తాను రాయలసీమ సింహం, పులి అని జగన్ చెప్పుకుంటుంటే, చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని వైసిపి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా మిగులు జలాలపై హక్కు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు వైఎస్ రాజశేఖర రెడ్డి 2005లో రాసిచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 2015లో కృష్ణా మిగులు జలాల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి ఢిల్లీ టూర్ ఎందుకో స్పష్టం చేయాలన్నారు. మెగా ఇంజనీరింగ్‌కు బిల్లు చెల్లిస్తే తెలంగాణ ఎన్నికలకు ఆయనకు ఉపయోగపడుతుందని బిల్లులు ఇవ్వాలని నిసిగ్గుగా జగన్ కోరుతున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని హాల్వి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన గ్రామ చావిడిని పీఠాధిపతులు మహంతేశ్వర స్వామి చేతులమీదుగా ప్రారంభించారు. సురేఖరి గ్రామంలో సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు హాల్విలో 'గడపగడపకు' వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగానే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతోందని తెలిపారు. స్థానికులు రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబుసాబ్, నాయకులు ఏకం రెడ్డి, రామన్న గౌడ్, చెన్నప్ప, బసవ ప్రభు, సిద్ధన్న గౌడ్, దర్గా సాధిక్, సర్పంచి క్రాంతి, మర్రి గౌడ్, బసప్ప గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రవేశపెట్టి పేదల ఆరోగ్యమే ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. శనివారం ఆదోనిలోని నిజాముద్దీన్, మైనార్టీ కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. జయమనోజ్‌రెడ్డి కౌన్సిలర్ ఫయాజ్‌తో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నిరుపేద ఆరోగ్యంగా ఉండాలని 'ఆరోగ్య సురక్ష' చేపడుతున్నట్లు తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, సన్నీ, కౌన్సిలర్ సందీప్, సురేష్, శ్రీనివాసులు, నాయకులు స్టోర్ నాగరాజ్, గోవిందు, లాల్ బాషా, చంద్ర, వీరాజి, అంజి, చలపతి, చిన్న రామకృష్ణ, హనుమంతు, చిన్న వీరప్ప, మణి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్, విద్యుత్ ఉద్యోగి హనుమంతు నాయక్, సచివాలయ అడ్మిన్ రాజు ఉన్నారు.

ప్రభుత్వ దమనకాండ వీడాలి : ఆశాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శాంతియుత నిరసనపై ప్రభుత్వ దమనకాండ విడనాడాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, నాయకులు రంగ లక్ష్మి, నరసమ్మ తెలిపారు. శనివారం ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో మృతి చెందిన కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, గుంటూరు జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఆశాలు, సిఐటియు జిల్లా నాయకులను అరెస్టు చేసి తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. నాయకులను, ఆశాలను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. మృతి చెందిన ఆశాల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇల్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని, జగనన్న సురక్ష పేరుతో ఆశా వర్కర్లపై మోపిన పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. నరసమ్మ, అన్వేశ్వరి, విశాలాక్షి, లక్ష్మి, రహీంబీ పాల్గొన్నారు.

'పొదుపునూ అలవర్చుకోవాలి'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సుబ్బయ్య

మహిళలు సంపాదనతో పాటు పొదుపును అలవర్చుకోవాలని రాచోటి సుబ్బయ్య తెలిపారు. శనివారం మహాయోగి లక్ష్మమ్మ అవ్వ బ్యాంకు పైఅంతస్తులో శ్రీమహాయోగి లక్ష్మమ్మ ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 45 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు రాచోటి సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 11 ఏళ్లుగా 2500 మంది పేద మహిళలకు, విద్యార్థినులకు సంస్థలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన అనేకమంది మహిళలు బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో గార్మెంట్స్‌లో ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు. నాలుగు నెలలు శిక్షణ పొంది జీవనోపాధితో పాటు పొదుపును పాటించాలని కోరారు. అవ్వ బ్యాంకు ఉపాధ్యక్షులు బాదామి లక్ష్మన్న శెట్టి, డైరెక్టర్లు ఆర్‌ఎంజి.రెడ్డి, సోమిశెట్టి సురేష్, శ్రీనివాసులు, బ్యాంక్ సిఇఒ గట్టు మురళీ కుమార్, నసీరుద్దీన్ పటేల్, బ్యాంకు మేనేజర్ జుల్ఫికర్, శ్యామ్ లాల్ సోనీ, జేరుబండి దానప్ప, టైలరింగ్ మాస్టర్ వెంకటలక్ష్మి, నాగమణి, నరసయ్య పాల్గొన్నారు.

వేదవతి నిర్మాణం కోసం పాదయాత్ర

- భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారమివ్వాలి - రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రాంత ప్రజల కోసం వేదవతి రిజర్వాయర్ పనులు ప్రారంభించి, నిర్మాణం పూర్తి చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిత్రవట్టి నుంచి ఆలూరు వరకు జరిగే రైతు పాదయాత్రను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. శనివారం జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గం శాశ్వత కరువు నివారణ కోసం వేదవతి ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించి, నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూములు ఎక్కువగా కోల్పోతున్న బిలేహాళ్ రైతులకు భూమికి భూమి ఇచ్చి, ఐదు సెంట్ల స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జింకల పార్కు ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని కోరారు. ఆలూరు చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మార్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలు, యువతను చైతన్య పరిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 9, 10, 11న పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటి రోజు నిత్రవట్టి, బిలేహాళ్, దేవరగట్టు, కొత్తపేట, నెరణికి తండా (రాత్రిబస), రెండో రోజు కరిడిగుడం, హులేబీడు, తుంబలబీడు, పెద్దహోతూరు (రాత్రి బస), మూడో రోజు పెద్దహోతూరు గ్రామం నుంచి ఆలూరుకు చేరుకొని రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న, కృష్ణ, షాకీర్, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం

- వైసిపి ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి

ప్రజాశక్తి - హాలహర్వి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేశారని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి తెలిపారు. శనివారం హాలహర్వి మండలం చత్రగుడిలో వైసిపి మండల కన్వీనర్ భీమప్ప ఆధ్వర్యంలో 'ఎపికి జగనే కావాలి' నిర్వహించారు. ఎంపిపి నెట్టికంటమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడారు. నవంబర్ 1 నుంచి మండలంలో నెలరోజులు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకొని మండల కన్వీనర్ విజయవంతం చేయాలని సూచించారు. ఈ ఆరు నెలల్లో వైసిపి ప్రభుత్వం ఏ ఇంటికైతే లబ్ధి చేకూర్చిందో ఆ వివరాలన్నీ ఆ కుటుంబ పెద్దలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు పాలన, జగన్ పాలన ఎలా ఉందో స్పష్టంగా తెలుసుకొని కుటుంబ యజమాని ద్వారా బుక్‌లెట్‌లో ముద్ర వేయించుకోవాలని తెలిపారు.

హోళగుంద : ప్రజల భవిష్యత్తు బాగుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, తనయుడు, యువనేత గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. మండలంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' మండల స్థాయి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలు తీర్చే లక్ష్యంతోనే జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

హోళగుందలో మాట్లాడుతున్న నారాయణ స్వామి

వనికె ఈరన్నకు సీతారామిరెడ్డి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

వయోభారంతో మృతి చెందిన వనికె ఈరన్నకు వైసిపి నాయకులు, టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి నివాళులర్పించారు. సంత మార్కెట్ సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ వనికె గురురాజ తండ్రి వనికె ఈరన్న మృతి విషయం తెలుసుకున్న ఆయన శనివారం మంత్రాలయం చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి భీమయ్య, గంగ పుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య, బొంబాయి శివ ఉన్నారు.

నివాళులర్పిస్తున్న సీతారామిరెడ్డి

దమ్ముంటే ఆధారాలు చూపాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్కిల్ డెవలప్ మెంట్ కేసులో జగన్మోహన్ రెడ్డికి దమ్ముంటే ఆధారాలు చూపాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో 'మేము సైతం' అంటూ లీగల్ సెల్ (లాయర్లు) రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేసి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. న్యాయవాదులు రాజకీయాల్లో రాణించి సేవలు అందిస్తున్నారని, అలాంటి వారికి పార్టీ సముచిత స్థానం కల్పించిందని పేర్కొన్నారు. అలాంటి వారిలో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి, కెఇ.కృష్ణమూర్తి, బిటి.నాయుడు లాంటి వారు చాలా మంది ఉన్నారన్నారు. అంతకుముందు లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాబురావు, జగన్నాథ్ రెడ్డి, గురు ప్రసాద్, కోసిగి వీరేష్, జక్కనగేని వెంకటేశ్వర్లు, హనుమేష్, తాయన్న, వీరేష్ గౌడ్, చావిడి వెంకటేష్, విజయరామిరెడ్డి, రవితేజ శెట్టి, రాజు, నరసింహులు, నాగరాజ్, జిలాన్ బాష, ఉదయ్ తదితర న్యాయవాదులు దీక్షలో కూర్చున్నారు. వీరికి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపి సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు బాపురం సుధీర్ రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరత్ శెట్టి, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, పంపాపతి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, అశోక్ రెడ్డి, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కోసిగి మారెప్ప, యోబు, రాగన్న, గవిగట్టు ఈరయ్య, గుడాలి ఈరయ్య, డీలర్ నరసన్న, అంపయ్య, జనార్ధన్, కేశన్న, అబ్దుల్ సాబ్, ప్రభాకర్ రెడ్డి, హుస్సేని, గుండేష్, మారేష్, లింగమూర్తి, ఐటిడిపి సాల్మన్ రాజ్, చిదానంద, లింగప్ప పాల్గొన్నారు. **ఆదోని**లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 'మేము సైతం' అంటూ క్రిస్టియన్లు అమర్ ప్రకాష్, రాయ నగర్ విజయ్, మహాత్మ గాంధీ నగర్ విజయ్, విరుపాపురం సోమనాథ్, రత్నం, చిన్నహరివాణం సుధాకర్, చెన్నప్ప, హెచ్.చిన్న మారెన్న, రాజేష్, జి.జగదీష్ సంఘీభావంగా రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. చర్చి పాస్టర్లు దీక్ష శిబిరం వద్దకొచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. న్యాయం తప్పకుండా జరుగుతుందని, ఆలస్యం కావచ్చుగాని ఎసిబి కోర్టులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో నలుగురు సీనియర్ న్యాయవాదులు న్యాయం కోసం పోరాడుతున్నారని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, నాయకులు రామస్వామి, స్వామి నాయుడు, చిట్టిబాబు, బాలరాజు, శివప్ప, శంకర్, సజ్జాద్, సాధుల్లా, అల్తాఫ్, మాజీ కౌన్సిలర్లు బాలాజీ, నరసింహులు, కృష్ణారెడ్డి, ఆరెకల్ రామకృష్ణ, దొడ్డనకేరి రవి, గోవిందప్ప, ఎల్లప్ప, సోమన్న, బసవరాజు, లోక్‌నాథ్ రెడ్డి, రంగన్న, లక్ష్మీనారాయణ, జయరాం, మల్లికార్జున, జగదీష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆలూరు

అప్పులబాధ తాళలేక రైతు ఎన్.జయరాముడు (55) పొలంలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని అంగస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు... మృతుడు జయరాముడు 4 ఎకరాలు సొంత పొలంతో పాటు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్ల నుంచి పంటలు పండక రూ.15 లక్షల అప్పులు మిగిలాయి. రెండు రోజుల క్రితం ఆలూరు కెడిసిసి బ్యాంకు వారు రూ.6 లక్షలు అప్పు చెల్లించాలని నోటీసు పంపారు. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం రాత్రి దేవాలయానికి భజన చేసేందుకు వెళ్తున్నట్లు భార్య ఉచ్చీరమ్మతో చెప్పారు. తిరిగి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన మహిళలు గుర్తించి జయరాముడు చెట్టుకు ఉరేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతునికి భార్య ఉచ్చీరమ్మ, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి ఈరన్న, సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ డిమాండ్ చేశారు.

కొత్త కాలనీ సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామం కొత్త కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. శనివారం గ్రామంలో పర్యటిస్తున్న ఎంపిడిఒ దశరథ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు, గ్రామస్తులు ఎల్లేష్ మాట్లాడారు. కొత్త కాలనీని 2009 వరదలు తర్వాత ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు సరైన సౌకర్యాల్లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్త కాలనీలో మూడు రోజులకొకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ డ్రెయినేజీ వేసి, రోడ్లు వేయకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్య ఆగడంతో ఒకరినొకరు కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. విఆర్ఒ వీరేష్ గౌడ్‌ను సస్పెండ్ చేయడంతో విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, విఆర్ఒను నియమించాలని కోరారు. కాలనీ మహిళలు కమల, గీత, కాశీ, రవి, సంతోష్, నాగేష్, కొండన్న పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No. 410 / 2017
O.S.No. 48 / 2016
టంగుటూరి గోవింద రావు
మరియు వగైరాలు - పిటిషనర్లు / వాదులు
వర్సెస్
మూలె బైరెడ్డి
మరియు వగైరాలు - రెస్పాండెంట్లు / ప్రతివాదులు
ఆర్డర్ 22 రూల్ 9 నోటీసు
టు,
ఆర్17. లక్కు లక్ష్మీ, భర్త వెంకటేశ్వర్లు, అదోని గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లోని పరిహారం డిక్రీ కోరి నీ మీద పిటిషనరు దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ,మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు తే13-10-2023ది న వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టువారి యెదుట హాజరై మీ సంజాయిషీ వ్రాతమూలంగా తెలుపుకొనవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీయందు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.
వాయిదా : 13-10-2023
పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
టి. గోపాలకృష్ణమూర్తి
పిటిషనరు తరపు న్యాయవాది

చదువులో ప్రతిభ కనబరచాలి

- ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ సావిత్రి

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనబరచాలని ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ సావిత్రి, ఎంఇఒ-2 బాలనాయుడు సూచించారు. శనివారం చిప్పగిరి కస్తూరిబా బాలికల కళాశాలలో కస్తూరిబా కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో 'సంకల్ప సత్త హై' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సావిత్రి, ఎంపిడిఒ కొండయ్య మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ చిప్పగిరి మండలాన్ని ఆస్పరేషన్ బ్లాక్‌గా ఎంపిక చేయడం హర్శించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు విద్య, డ్రాయింగ్, గర్ల్స్ ఎగ్జిబిషన్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నగరడోన ఉపాధ్యాయులు మహ్మద్ రఫీని, ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన చిప్పగిరికి చెందిన 8వ తరగతి విద్యార్థి హారికను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు క్రీడా దుస్తులను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివ జ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, సామాన్య శాస్త్ర ఉపాధ్యాయులు కేజీయరాణి తమ సొంత డబ్బుతో విద్యార్థుల కోసం 25 జతల క్రీడా దుస్తులను అందజేశారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించరా..?

- డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతినెల జీతాల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ తెలిపారు. శనివారం మండలంలో మదిరే, సంతేకుడ్లూరు, పెద్దహరివాణం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, డిటిఎఫ్ జిల్లా బాధ్యులు వెంకటరాముడు, హనుమంతు, నాగరాజ్ గౌడ్, బందే నవాజ్, మద్దిలేటి పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోని

మండలంలోని పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌లు పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ రహదారికి సంబంధించిన భూ సేకరణ పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా నాగలాపురం, చిన్నహరివాణం, కపటి, గనేకల్లు, కుప్పగల్లు, పెద్దహరివాణం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతిపాదనలు వచ్చిన గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఈనెల చివరిలోపు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మండగిరి గ్రామల్లో జల జీవన్ మిషన్ త్రాగునీరు అందించే కార్యక్రమం టెండర్ దశను పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ ఖాదర్ బాష, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ రావు, డిప్యూటీ ఇంజినీర్ శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తలుపులు మూసి సమావేశం : సమావేశానికి మీడియాకు అనుమతి లేకుండా రహస్యంగా నిర్వహించారు. ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనుల గురించి చర్చించే సమయంలో అంత రహస్యం ఏముందో అధికారులు తెల్పాలని పలువురు పేర్కొన్నారు. అభివృద్ధి గురించి నిర్వహించాల్సిన సమావేశంపై అంత గోప్యత ఏమిటో అధికారులే తెలపాల్సి ఉంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

షేక్ సమ్రీన్‌కు సన్మానం

- వైద్య విభాగంలో ప్రభుత్వ కోటాలో సీటు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తహశీల్దార్ కార్యాలయంలో సన్మానిస్తున్న నాయకులు

వైద్య విభాగంలో ప్రభుత్వ కోటలో 'ఎ' క్యాట్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించిన షేక్ సమ్రీన్‌ను జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యక్షులు షేక్ అహ్మద్ అధ్యక్షతన శనివారం తహశీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. తహశీల్దార్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ... ప్రజలకు సేవలందించే అవకాశం దక్కడం ఎంతో అదృష్టమన్నారు. రేషన్ డీలర్ల పిల్లలకు పేదలకు సేవలు చేసుకునే భాగ్యం దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. నీట్‌లో ర్యాంకు సాధించి కన్వీనర్ కోటాలో తిరుపతిలోని శ్రీబాలాజీ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన షేక్ సమ్రీన్‌ను అభినందించారు. షేక్ సమ్రీన్‌కు తహశీల్దార్ ఆంజనేయులు శాలువా కప్పి సన్మానించారు. రేషన్ దంపతులు తల్లి షహనాజ్ బేగం, తండ్రి ఎస్.మహబూబ్ బాషాలు అధికారులు, డీలర్లు, అభినందించి మిఠాయిలను పంచిపెట్టారు. డిప్యూటీ తహశీల్దార్ గురు రాజారావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, గుడికల్ రాముడు, తిమ్మారెడ్డి, రవి, నరసింహులు, రామలింగడు, కౌలుట్ల ఈరన్న పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No. 411 / 2017
O.S.No. 48 / 2016
టంగుటూరి గోవింద రావు
మరియు వగైరాలు - పిటిషనర్లు / వాదులు
వర్సెస్
మూలె బైరెడ్డి
మరియు వగైరాలు - రెస్పాండెంట్లు / ప్రతివాదులు
ఆర్డర్ 22 రూల్ 4 నోటీసు
టు,
ఆర్17. లక్కు లక్ష్మీ, భర్త వెంకటేశ్వర్లు, అదోని గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లోని పరిహారం డిక్రీ కోరి నీ మీద పిటిషనరు దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ,మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు తే13-10-2023ది న వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టువారి యెదుట హాజరై మీ సంజాయిషీ వ్రాతమూలంగా తెలుపుకొనవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీయందు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.
వాయిదా : 13-10-2023
పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
టి. గోపాలకృష్ణమూర్తి
పిటిషనరు తరపు న్యాయవాది

పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే ఎర్రకోట
- ఘనంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - నందవరం

పేదల ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నాగలదిన్నె గ్రామం సచివాలయం-1 పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి రూ.కోట్లాది ఖర్చు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, సర్పంచి లక్ష్మి, తహశీల్దార్ నిత్యానంద రాజు, ఎంపిడిఒ దశరథ రామయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, డాక్టర్లు చంద్ర కాంత్, సౌజన్య, ఎపిఎం వీరన్న, అతావుల్లా, నాగప్ప, శరత్, రాజేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాక్షిగా ఎంఇఒకు అవమానం : ఎంఇఒ సుదర్శన్ రెడ్డికి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి సాక్షిగా అవమానం జరిగింది. కొంతమంది వైసిపి నాయకులు ఎలాంటి పదవులూ లేకున్నా స్టేజిపై కూర్చున్నారు. మండల స్థాయి అధికారి అని కూడా చూడకుండా స్టేజిపై స్థలం కేటాయించకపోవడంతో గత్యంతరం లేక ఆయన స్టేజి పక్కనే కుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఇదంతా ఎవరూ గమనించకపోవడంతో సమావేశం ముగింపు దశ వరకు ఆయన అలాగే స్టేజి పక్కనే కూర్చున్నారు. కొంతమంది స్టేజిపై ఓ పక్కన కుర్చీ చేసి కూర్చోబెట్టారు. ఎంఇఒకే గౌరవం దక్కకపోవడంతో కొంతమంది విద్యావంతులు అధికార పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని శివన్న నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు హాజరై ప్రారంభించారు. వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బుట్టా రంగయ్య, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రాజు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని సచివాలయం -1 పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ న్యూటన్, అమీలియో హాస్పిటల్ పీడియాట్రిక్ డాక్టర్ విజయశ్రీ, స్థానిక వైద్యులు డాక్టర్ అపర్ణ, డాక్టర్ కార్తీక్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండల కోఆప్షన్ మాజీ సభ్యులు, వైసిపి యూత్ లీడర్ టి.బందే నవాజ్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, సర్పంచి హైమావతి, ఇఒఆర్‌డి నగేష్, ఎఒ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సతీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ విరుపాక్షి, బగిలి ఉస్మాన్, కనికే పద్మనాభం, బగిలి రఫీ, ఎంపిహెచ్ఒ హనుమంతు, సూపర్‌వైజర్ పరమేష్ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం బిణిగేరి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను డాక్టర్ రఘురాం రెడ్డి, తహశీల్దార్ కుమార స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచి వెంకటేష్, డాక్టర్లు దుర్గాబాయి, సైకాలజిస్ట్ కల్పన, డాక్టర్ బాల సిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శులు నాగమణి, నబీరసూల్, విఆర్ఒ ఉమాదేవి, ఎఎన్ఎంలు సంధ్యారాణి, రాధా, పద్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం సూగురు గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిడిఒ మణిమంజరి ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్, సర్పంచి భర్త లక్ష్మయ్య పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచి ప్రేమ్ కుమార్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. కర్నూలు విశ్వ భారతి ఆస్పత్రి నుంచి వచ్చిన డాక్టర్లు మురళీ మోహన్, షేక్ రేష్మ, మనోజ్, చిప్పగిరి వైద్యాధికారి జమీల్ అహ్మద్‌లు 700 మంది పురుషులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మెడిసిన్ అందజేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్స్‌ను సర్పంచి, తహశీల్దార్ పరిశీలించారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషన్‌పై అడిగి తెలుసుకున్నారు. వైసిపి నాయకులు గురుదాసు, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, విఆర్ఒ వీరన్న పాల్గొన్నారు.

నందవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎర్రకోట

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No. 412 / 2017
O.S.No. 48 / 2016
టంగుటూరి గోవింద రావు
మరియు వగైరాలు - పిటిషనర్లు / వాదులు
వర్సెస్
మూలె బైరెడ్డి
మరియు వగైరాలు - రెస్పాండెంట్లు / ప్రతివాదులు
సెక్షన్ 5 నోటీసు
టు,
ఆర్17. లక్కు లక్ష్మీ, భర్త వెంకటేశ్వర్లు, అదోని గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లోని పరిహారం డిక్రీ కోరి నీ మీద పిటిషనరు దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ,మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు తే13-10-2023ది న వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టువారి యెదుట హాజరై మీ సంజాయిషీ వ్రాతమూలంగా తెలుపుకొనవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీయందు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.
వాయిదా : 13-10-2023
పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
టి. గోపాలకృష్ణమూర్తి
పిటిషనరు తరపు న్యాయవాది

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.షేబారాణి

ప్రజాశక్తి - బేతంచర్ల

అంగన్వాడీ సెంటర్లలో గర్భిణులకు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ యాప్ (ఫేస్ యాప్)ను రద్దు చేయాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు జి.షేబారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బేతంచెర్లలోని సచివాలయం ఎదుట లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపటాటరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్వాడీ సెంటర్లలో గర్భిణులకు, బాలింతలకు అనుబంధ ఆహారం అందించడానికి టేక్ హెూమ్ రేషన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ లబ్ధిదారులను అంగన్వాడీ సెంటర్లకు పిలిపించుకొని వారి ఫేస్‌లను ఫోటోలు తీయించి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ విధానం లబ్ధిదారులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇది గమనించని ఐసిడిఎస్ ఉన్నత అధికారులు అంగన్వాడీ వర్కర్లపై ఒత్తిడి తీసుకురావడం ఎంత మాత్రం సరైనది కాదని అన్నారు. పాలక ప్రభుత్వాలు అంగన్వాడీ వర్కర్లకు సరిగా పని చేయని, నాసిరకం సెల్ ఫోన్లు ఇచ్చారని, మారుమూల ప్రాంతాలలో సెల్‌కు సిగ్నల్ అందక అంగన్వాడీ టీచర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. లబ్ధిదారులు కూడా ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వం స్పందించి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, లబ్ధిదారులను కలుపుకొని ఉద్యమ పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుర్తించిన బడి ఈడు పిల్లల నమోదు

సర్వే పూర్తి చేయండి

- జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో కొత్త వ్యాధులకు ఖచ్చితమైన చికిత్స
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాల్లో గుర్తించి పెండింగ్‌లో ఉన్న బడి ఈడు పిల్లల నమోదు సర్వే (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి కెఎస్‌జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుండి వర్చువల్ విధానంలో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్త్రీశిశు సంక్షేమం, బాల్య వివాహాల నిరోధక చర్యలు, పాఠశాల విద్య, హౌసింగ్, జగనన్నకు చెబుదాం-స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో పాటు జిల్లాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో గుర్తించిన కొత్త వ్యాధులకు ఖచ్చితమైన ట్రీట్మెంట్ ఇచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. జగనన్న లేఔట్లలో మౌలిక సదుపాయాలతో పాటు ఆర్చీల నిర్మాణ పనులను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే పూర్తి చేయడంతో పాటు నాడు-నేడు కింద చేపట్టిన పనులు కూడా త్వరితగతన పూర్తి చేయాలని డిఇఒ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు. జగనన్న లేఔట్లలో మంజూరు చేసిన 98 ఆర్చీల నిర్మాణాలు ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

క్రికెట్ బెట్టింగ్ జోలికెళితే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అమాయకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమాయక ప్రజలను, యువకులను లక్ష్యంగా చేసుకొని, ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదనఆనరు. ఐసిసి క్రికెట్ ప్రపంచ కప్ 2023 నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెంచినట్లు తెలిపారు. ఎపి జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటా మని, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. నంద్యాల జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారమివ్వాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆశాల కుటుంబాలను ఆదుకోవాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో ఆకస్మికంగా చనిపోయిన ఆశా కార్యకర్త కృపమ్మ కుటుంబానికి, చిత్తూరు జిల్లాలో చనిపోయిన జానకి కుటుంబానికి న్యాయం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా నాయకురాలు భారతి, అపర్ణ, వరలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో ఆశ కార్యకర్తలపై పనిభారం మోపి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో చనిపోయిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో రూ. 50 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇల్లు, ఇళ్ల స్థలం ఇవ్వాలని, జగనన్న సురక్ష పేరుతో ఆశా వర్కర్లపై మోపిన పని భారాన్ని తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.యేసురత్నం

క్లాప్ డ్రైవర్ల కష్టాలు వినేదెవరు..?

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్లపేరుతో కర్నూలు నగరంలో రెడ్డి ఏజెన్సీ వారు 91క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసి 98 మంది డ్రైవర్లను తీసుకున్నారు. వారిలో 45 మందికి 4 నెలల నుండి 10 నెలల వరకు, అందరికీ కామన్‌గా 3 నెలలు జీతాలు ఇవ్వలేదు. జీతాలు ఇప్పించాల్సిన మున్సిపల్ కమిషనర్ మాకు సంబంధం లేదని, జీతాలు అడిగితే పని నుండి తొలగిస్తా మంటున్నారు. అగ్రిమెంట్లో ఉన్న ప్రకారం జీతం, పిఎఫ్, ఇఎస్ఐ తోపాటు కార్మిక చట్టాలు అమలు చేయాలని కార్మికులు కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే తాము సమ్మెకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించినా స్పందించలేదు. ఈఏడాది ఆగస్టు 11నుంచి ఆందోళనలు, సమ్మె చేశారు. అయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించారు. ధర్నాలు, ప్రదర్శనలు, అర్ధనగ్న ప్రదర్శనలు, ఊరేగింపులు, జగనన్నకు చెబుదాం స్పందనలో వినతులు ఇచ్చారు. ఇన్ని రకాల నిరసన తెలిపినా దున్నపోతుమీద వర్షం పడిన చందాన ఎవరూ స్పందించరేంటీ?... వారేమి గొంతెమ్మ కోరికలు కోరలేదు. ఇంటింటికి తిరిగి సేకరించిన తడి పొడి చెత్తను వేరు చేసి చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాలకు తరలించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పని చేసే కార్మికులకు కనీసవేతనం కూడా కాదు. ఒప్పందం ప్రకారం జీతం, ఇఎస్ఐ, పిఎఫ్ ఇవ్వమన్నారు. ఏడాది నుంచి కట్టింగు చేసిన పిఎఫ్ డబ్బులను వారి అకౌంట్‌లో జమచేయమన్నారు. కార్మికుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వకుంటే బదికేదెలా? జనంతో చెత్తపన్ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారే... దాని నుంచి ఇవ్వడానికేంటి.? నిజంగా కర్నూలు నగర పాలకులు మనుషులైతే స్పందిస్తారని ఆశిద్దాం...

ఉన్నఫలంగా ఇళ్లకూల్చివేత : నంద్యాల జిల్లాకేంద్రంలోని బొగ్గులైన్ రోడ్డు కిరువైపులా అనేక ఏళ్ల నుండి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేద ప్రజలను అక్కడి నుండి ఆదివారం ఖాళీ చేయించారు. రెవిన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు గుడిసెలను కూల్చి వేశారు. దాదాపు 400 మంది పోలీసుల తో ముగ్గురు సీఐలు ఇద్దరు డిఎస్పీ లు వచ్చి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పేద ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లలో సామాగ్రి, వస్తువులు ఉన్నాయని సమయం ఇవ్వండని వేడుకున్నా పట్టించుకోకుండా కూల్చివేస్తే తాము ఎక్కడికి వెళ్లాలని వాపోయారు. నివాసిత ప్రజలు ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్నారు. బొమ్మల సత్రం ఏరియాలో ఏమి జరుగుతుందో ప్రజలకు అర్థం కాలేదు.. షాక్ నుండి కోలుకునే సరికి దాదాపు బొగ్గులైన్ ఏరియాలో 30 ఇళ్లను నేల మట్టం చేశారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం, సిపిఎం నాయకులు సంఘటనా స్థలానికి వెళ్లి వారికీ బాసటగా నిలిచారు. కూల్చివేతను అడ్డుకున్న కొంతమంది బాధితులను సిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనను గమనించిన పోలీసులు అక్కడ నుండి ఖాళీ చేయడానికి బాధితులకు మరో 3 రోజులు అవకాశం ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అక్కడ ఇళ్లు ఖాళీ చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. చివరికి కొంత సమయం తీసుకుని తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రత్యామ్నయం చూపకుండా ఎలా ఖాళీ చేయిస్తారని బాధితులు, ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. అసలు విషయ మేమంటే అక్కడికి సమీపాన ఉన్న నంద్యాల ఎంపి ఆస్తులకు విలువ పెంచేందుకు రోడ్డువైడినింగ్ పేరుతో ఖాళీ చేయించాలని అధికార యంత్రా ంగం సిద్ధమైనట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా పేదలకు ప్రత్యామ్నాయం చూపించాక ఖాళీ చేయించాలని బాధితులు కోరుతున్నారు.

నిరసనాగ్రహం: ఉత్తరప్రదేశ్ లిఖింపూర్‌లో నలుగురు రైతుల హత్యకు కారకుడైన కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ప్రధాన కారకుడని వెంటనే కేంద్రమంత్రిని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక,రైతు సంఘాల పిలుపు మేరకు ఒకరోజు బ్లాక్ నిర్వహించారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్లు అన్ని మండలాల్లోని తహశీల్దార్ల కార్యాలయాల ముందు నిరసన తెలిపారు.

ఢిల్లీలో న్యూస్‌క్లిక్ మీడియా కార్యా లయాలపై పోలీసులు, ఎన్ఐఎ సోదాలు, పోలీసుల దాడి, అరెస్టును ఖండిస్తూ జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజా స్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలను ఎండగట్టారు.

ఆవిర్భాం దినోత్సవం: కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కెవిపిఎస్ కార్యాలయాల ముందు, వివిధ కూడళ్లలో జెండాను ఎగుర వేశారు. ఇప్పటి వరకు కెవిపిఎస్ సాధించిన విజయాలను, సామాజిక ఉద్యమాలను నెమరేసుకున్నారు.

మహాత్మా గాంధీస్ఫూర్తితో: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు లలిత కళా సమితిలో వర్తమాన పరిస్థితులు - మత సామరస్యం - ఆవశ్యకత అంశంపై సదస్సు నిర్వహించారు. గాంధీ స్ఫూర్తితో మత సామ రస్యాన్ని చాటాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పిలుపు నిచ్చారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు.

బాబుతోడుగా మేముసైతం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై పెట్టిన కేసులను ఎత్తేయాలని ఈ వారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జుల నాయకత్వంలో 14 నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బాబు తోడుగా 'మేము సైతం' పేరుతో టిడిపి శ్రేణులు రిలే నిరసన దీక్షలు చేస్తున్నాయి. ఆయా ప్రాంతాలలో వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు.

జగనన్న ఆరోగ్య సురక్ష : జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం కార్యక్రమాలు చేపడుతుంది. ఆయా సచివాయాల పరిధిలో అన్ని రకాల పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ప్రచారం చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ

లిటిల్ ఫ్లవర్ స్కూల్‌ను తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌ను ఎంఇఒ అబ్దుల్ కలాం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లాసులో ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను అడిగి వారిని అభినందించారు. ఉపాధ్యాయుల బోధనను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ విమలావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మొబైల్ రికవరీ మేళా : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్‌లను రికవరీ చేశామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిని నేడు జిల్లా మొబైల్ రికవరీ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు, 9121101107కు వాట్స్ యాప్‌లో అప్లై చేసుకున్నవారు ఆధార్ కార్డ్‌తో పాటు మొబైల్‌కు సంబంధించిన ధృవ పత్రాలను తీసుకొని జిల్లా పోలీసు కార్యాలయానికి ఉదయం 8:30 గంటలకు రావాలని పేర్కొన్నారు. ఇప్పటికే రికవరీ అయిన మొబైల్‌కు సంబందించి ఫిర్యాదు చేసిన వారి నంబర్ ఆధారంగా వారికి ఫోన్ చేశామని, కావున పోగొట్టుకున్న మొబైల్ ధృవపత్రాలను పరిశీలించి ఇస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఫోన్ ద్వారా మీ మొబైల్ దొరికిందని సమాచారం పొందిన వ్యక్తులు మాత్రమే జిల్లా పోలీసు కార్యాలయానికి రావాలని తెలిపారు.

21న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నందికొట్కూరు : ఈ నెల 21న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ ఇంద్ర ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.పవన్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల కేసులు పరిష్కరించు కోవచ్చన్నారు. అలాగే పోలీస్ సిబ్బంది వారికి వివాహ భరణం కేసులు, భూమి తగాదా, క్రిమినల్ కేసులు రాజీ పరచుకోవచ్చని, అన్ని రకాల కేసులు కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజూ జరిగే ఫ్రీ లీగల్ సర్వీసును ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్ బాబు, అడ్వకేట్ వెంకటరాముడు, కొంగరవెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, జయపాల్, ప్యారా లీగల్ వాలంటీర్స్ ఉమాదేవి, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు హర్షణీయం : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె

వసుధ ఫౌండేషన్ సేవలు హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బీసీ ఇందిరా పేర్కొన్నారు. శనివారం పట్టణంలో వసుధ ఫౌండేషన్ కర్నూలు జిల్లా కన్వీనర్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రూ. 25 వేలు చెక్కులను బీసీ ఇందిరా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో పట్టణ, చుట్టు పక్కల గ్రామాల వారు అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి బాగోలేక బాధపడుతున్న ముగ్గురికి రూ. 25 వేలు చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. యనకండ్ల గ్రామానికి చెందిన ముగ్గురు మతిస్థితం లేని పిల్లలకు జీవితాంతం రూ. 3 వేల చొప్పున పింఛన్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వసుధ ఫౌండేషన్ గతంలో విద్యార్థులకు పుస్తకాలు , ఉపకార వేతనాలు ఇచ్చినట్లు చెప్పారు. కరోనా సమయంలో 10 మందికి ఒక్కొక్కరికి పదివేల చొప్పున ఆర్థిక సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వసుధ ఫౌండేషన్ సహకారంతో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పక్కిరా రెడ్డి, యనకండ్ల ఖాదర్ భాష, లాయర్ నాగేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరా

రూముల అద్దెలు అధికంగా వసూలు చేస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్ర పరిసరాల్లో వున్న ప్రైవేటు లాడ్జిల యజమానులు భక్తులతో రూమ్‌ల బాడుగలు అధికంగా వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నంద్యాల డిఎస్పి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మహానంది గ్రామంలో లాడ్జిలు నిర్వహిస్తున్న యజమానులతో డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, సీఐ రవీంద్ర మహానంది పోలీస్ స్టేషన్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రతి లాడ్జి నందు రేట్ల టారిఫ్ పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. సెలవు దినాలలో భక్తులతో అధిక బాడుగలు వసూలు చేయరాదని, రిజిష్టర్ రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జిలలో బాడుగకు అసాంఘిక కార్యక్రమాలకు గదులు ఇచ్చినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నాగేంద్రప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపికి ఓటు వేస్తే రాష్ట్రం మరో బీహారే..

- మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజలు పొరపాటున మరోసారి వైసిపికి ఓటేస్తే రాష్ట్రం మరో బీహార్‌లా మారుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పాలన తుగ్లక్, హిట్లర్ పాలనను తలపిస్తుందన్నారు. ఆయన ఏం తప్పు చేశారన్న దానిపై ఇప్పటివరకు కూడా సిఐడి అధికారులు రుజువు చేయలేకపోయారన్నారు. ఏదో ఒక విధంగా చంద్రబాబును జైల్లో పెట్టాలని వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. స్కిల్ స్కాంలో మొదట 3 వేల కోట్ల కుంభకోణమని, ఆ తరువాత 330 కోట్లని, చివరకు రూ. 27 కోట్లు జరిగిందని వైసిపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మచ్చలేని నాయకుడిగా వస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. వైసిపి ఎన్ని కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపును ఆపలేరన్నారు. రాష్ట్రాన్ని మూడు రాజధానుల పేరుతో భ్రష్టు పట్టించారని ఎద్దేవా చేశారు. చివరకు మూడు రాజధానుల ఊసే లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. పొలాల్లో తేడాలు ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలైందన్నారు. ఆన్లైన్లో ఓ రకంగానూ, పాస్ పుస్తకాల్లో మరో రకం గాను భూములు ఉన్నట్లు చూపుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన భూ రీ సర్వే సమస్యలను పెంచిందన్నారు. మూడు రోజుల్లోగా రీ సర్వే పై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. టిడిపి హయాంలో చేపట్టిన టిడ్కో గృహాలు, మంచినీటి పథకాలు ఇప్పటికీ పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. **బనగానపల్లె :** స్కిల్ డెవలప్మెంట్ కేసులో సిఐడి అధికారులు ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో అసలు అవినీతి జరిగినట్లు వైసీపీ ప్రభుత్వం, సిఐడి అధికారులు నిరూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, తెలుగు యువత నంద్యాల జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, బీసీ సెల్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు బీ.సీ. మదన్ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ

క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - పగిడ్యాల

నేడు నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలకు క్రీడా మైదానాన్ని సర్వం సిద్ధం చేశారు. శనివారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. క్రీడా మైదానంలో ముఖ్యంగా తాగునీటి వసతి కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, శ్రీధర్ కుమార్, తోకల పితామరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణం, రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

విద్యార్థినీ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు రోడ్డుభద్రత, పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు బాల సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. శనివారం కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ అధికారి హెచ్ ఆర్ ఫంక్షన్ హాల్ హెడ్ జె రంగకుమార్ ఆధ్వర్యంలో వికాస్ పర్యవేక్షణలో అనంతపురంకు చెందిన రాజు బృందం సహాయంతో కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ విజయ్ చౌదరి,కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్. సయ్యద్ మీర్ ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూర్

వైసిపి ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు ఎస్ఎస్ సయ్యద్ మీర్, కో ఆప్షన్ మెంబర్ రషీద్, 16వ వార్డ్ కౌన్సిలర్ కురుపాటి విజయ చౌదరిలను 7, 8వ సచివాలయం కన్వీనర్లు రమణ, చంద్రశేఖర్, నాగరాజు, కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించారు. శనివారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు అంగన్వాడీ సెంటర్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పూల బొకే అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి వై.తిమోతి, జెసిఎస్ టౌన్ ఇంచార్జ్ సుల్తాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, కౌన్సిలర్లు పాణ్యం పార్వతి, మిట్టకందాల మోహబతుల్లా, బోర్వెల్ రెహమాన్, ముర్తుజా, మక్బుల్, కలీముల్లా, షఫీవుల్లా, వైసిపి నాయకులు జెడ్.శ్రీనివాసరెడ్డి, రఫీక్, వరాల మాలిక్, జేయుం, ఎన్.ఎస్.రషీద్, అన్వర్ ఖుద్దూస్, అమ్మద్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మహానంది

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి శనివారం మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన నాగార్జున గత కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు.త నందిపల్లె గ్రామం-నంద్యాల మధ్యలో రైలు ఢీకొని మృతి చెందినట్లు మతుని సోదరుడు మల్లికార్జున తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం

- మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం ఏ రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ఆత్మకూర్ పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుంటామని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం ఎ రషీద్ అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డు పరిధిలో. రూ. 6 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఈ రోడ్డు విషయాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకురావడంతో వెంటనే నిధులు కేటాయించి సిసి రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్షావలి, వార్డు ఇంచార్జ్ షంషూర్, మున్సిపల్ ఏఈ, వైసిపి నాయకులు, షఫీ ఉల్లా, ముర్తు జావలి, బేస్త శీనువాసులు, శాలి ఫైల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంఏ రషీద్

ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక అక్రమ కేసులు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజా క్షేత్రంలో ఎదుర్కోలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయ సమీపంలో మాల మహానాడు నాయకులు నిరాహార దీక్ష నిర్వహించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదని, వైసీపీ నియంత పాలనపై అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న మాల మహానాడు నాయకులకు నిమ్మరసం ఇచ్చి టిడిపి నాయకులు దీక్షలను విరమింప చేశారు. **కొత్తపల్లి :** చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మండలంలోని వీరాపురం గ్రామంలో టిడిపి మండల నాయకులు కర్నాటి శివారెడ్డి అధ్వర్యంలో పార్టీ నాయకుల కుటుంబ సభ్యులతో కలిసి పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు. అధ్యక్షురాలు సరళ, మాజీ సర్పంచ్ పుల్లన్న, చెన్నారెడ్డి, రమణారెడ్డి, పింజరి చిన్న జంగ్లి సాహెబ్ ,అహమ్మద్ హుసేన్, వెంకటేశ్వర రెడ్డి, ఐ టిడిపి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, లక్ష్మి దేవామ్మ, అనూష పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆత్మకూరు బస్టాండ్ ఎదురుగా పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు దీక్షా కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి, శ్రీశైల దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో మొమిన్ రసూల్, హిదయత్ అలీఖాన్, వెన్న శ్రీధర్ రెడ్డి, రమేష్ గౌడ్, నాగేశ్వర నాయక్, శివ, అశోక్, పరమేశ్వర్ రెడ్డి, బుక్కాపురం శివయ్య, సుబ్రమణ్యం, నాగ లక్ష్మయ్య, చిన్న, లింగస్వామి, రహంతుల్లా, గోవర్ధన్ రెడ్డి, ప్రసాద్, రమేష్, సయ్యద్, మహేష్, మనోహర్, సతీష్ బాబు తదితరులు దీక్ష చేపట్టారు. వీరి దీక్షకు సంఘీభావంగా టిడిపి నాయకులు యుగంధర్ రెడ్డి, వేణు గోపాల్, శివ ప్రసాద్ రెడ్డి, అబ్దుల్లా పురం బాషా, రాజా రెడ్డి, కలిముల్లా, నజీర్ అహ్మద్, న్యమతుల్లా, గౌస్, అన్వర్, శాబుద్దిన్, రామూర్థి, వెంకట్రావ్, రవీంద్రా బాబు, కోయ హోటల్ మున్నా, కటా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెలుగోడు మండలం వేల్పూరు గ్రామంలో కాంతిలో క్రాంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా కొనసాగుతున్న దీక్షల్లో 25వ రోజు నంద్యాల లీగల్ సెల్ న్యాయవాదులు, 23వ వార్డ్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడారు. అనంతరం దీక్షలో పాల్గొన్నవారికి నంద్యాల పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్ అహ్మద్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ జేవీ మనోహర్ రెడ్డి, టిడిపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ వెంకటేస్వర్లు, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ నటరాజ్, రమణ రెడ్డి, స్పోక్ పర్సన్ నరేంద్ర కుమార్ రెడ్డి, సెక్రెటరీ లాయర్ బాబు, భూమా వెంకట రెడ్డి, బాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు దీక్షలో పాల్గొన్నారు. మోత్కులపల్లె సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ నన్నేబై గారి జిలాని మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుంచి విడుదల అయ్యేంతవరకు తమ ఉద్యమం ఆగదన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపును ఎవరు ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో వనిపెంట గోపాల్, కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు. **అలాగే** అహోబిలం గ్రామంలో లైట్లు ఆర్పేసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కర్నూల్ జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు సంజీవ రాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రమణ , వీరభద్రుడు నంద్యాల పార్లమెంట్ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి కోమలపాటి రాజారావు, అనకలనరేష్, రామయ్య విజయ్ పాల్గొన్నారు. అలాగే సిరివెళ్లలో టిడిపి నాయకులు యామ గుర్రప్ప, ఉల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఎర్రగుంట్ల 2 ఎంపీటీసీ కమ్మతం జయరాం రెడ్డి, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం నిత్యం తపించే చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటికి రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని గ్రామ టిడిపి నాయకుడు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి నిర్వహించారు. అనంతరం కాంతి క్రాంతి కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు, కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. టిడిపి మండల కన్వీనర్ నరసింహారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్‌ఉపాధ్యక్షుడు అన్సర్ భాష, మైనార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి ముల్లా అజీమ్ హనీఫ్ గఫార్ నాగూర్ బషీర్ నూర్ భాషా వెంకట్ రాంరెడ్డి, జనార్దన్ రెడ్డి నరసింహారెడ్డి సంజీవరెడ్డి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు **ప్యాపిలి :** వైసీపీ రాష్టంలో మునిగిపోయే పడవలాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలో కాంతితో క్రాంతి కార్యక్రమం నిర్వహించారు. దీపాలు, కొవ్వొత్తులు, మొబైల్ లైట్లు వెలిగించి నిరసన తెలిపారు. రామ్మోహన్ యాదవ్, చిన్న సుంకయ్య, పెద రామాంజనేయులు, నాగేంద్ర,, మల్లికార్జున, పూజారి శివ, ఎస్ కె వలి, రాజు, మధు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో...


నంద్యాలలో...

బనగానపల్లె : మాల మహానాడు నాయకులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ఆత్మకూర్‌లో...

చాగలమర్రి : నేలంపాడులో కాగడాలతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి

సంక్షేమ పథకాలే మా బలం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని పార్టీలన్నీ ఏకం అవుతున్నాయని, కానీ సంక్షేమ పథకాలే తమ బలమని, ఒంటరిగానే పోటీ చేసి అఖండ మెజారిటీతో గెలుస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం అవుకు పట్టణంలోని గాయత్రీ రైస్ మిల్ ప్రాంగణంలో 'ఎపికి మళ్లీ జగనే కావాలి మళ్లీ జగనే రావాలి' కార్యక్రమాన్ని చల్లా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమ బలమన్నారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ఓట్లను రాబట్టుకోవడం కోసం టిడిపి నాయకులు అనేక రకాల జిమ్మిక్కులు చేస్తున్నారని అన్నారు. వైసిపి సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో వైసిపి అఖండ విజయం సాధించి మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గృహ సారధులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలిస్తూ అభివృద్ధిని ప్రజలకు వివరించాలని తెలిపారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియం చంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న నాయకుల కుటుంబాలందరూ వైసిపిలోనే ఉన్నారని, అందరి సహాయ సహకారాలతో 2024 ఎన్నికల్లో పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, నియోజకవర్గ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉప సర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, యువ నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, సర్పంచి మంద గురమ్మ, సచివాలయ కన్వీనర్‌లు, వాలంటీర్లు, గృహ సారధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **రుద్రవరం :** గ్రామాలలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని వైసిపి నాయకులకు, కార్యకర్తలకు, మండల కన్వీనర్లకు, గృహ సారధులకు, వాలంటీర్లకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. రుద్రవరంలోని అమ్మవారి శాల కళ్యాణ మండపంలో వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ మబ్బు బాలస్వామి, విజయ పాల డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, సీనియర్ నాయకులు గంగిశెట్టి మద్దిలేటి శెట్టి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చోళవేటి సూర్యనారాయణ శెట్టి, నూకల కష్ణమూర్తి, మండల అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, మండల జేసిఎస్ కన్వీనర్ పాణ్యం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ నాయకులు చల్లా, పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం

బాల్య వివాహాలపై అవగాహన కల్పించినట్లు అంగన్‌వాడి కార్యకర్తలు రాజేశ్వరి, సుగుణ శ్రీ, రాజకుమారి తెలిపారు. శనివారం మండలంలోని ముత్తలూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు వారి సెంటర్ల పరిధిలో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని తెలుసుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి నుంచి తమ పిల్లలకు బాలవివాహాలు చేయమని వాగ్మూలం తీసుకున్నారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలు వివరించారు. అమ్మాయిలకు కనీస వయసు 18, అబ్బాయికి 21 సంవత్సరాలు ఉండాలన్నారు.

ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జలకనూరు సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని జలకనూరు గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం జలకనూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, నాయకులు ఫకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, టి ఓబులేష్, గ్రామస్తులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిగుండం చెరువు కింద చింతలపల్లె, కాజీపేట, జలకనూరు, సుంకేసుల, గని తదితర గ్రామాలకు చెందిన దాదాపు 5 వేల ఎకరాలు వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తారని, గత ఐదారు సంవత్సరాల నుండి తూము సక్రమంగా పని చేయకపోవడం వల్ల రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గ్రామంలో ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టి పశువుల ఆసుపత్రి నిర్మించినా డాక్టరు లేకపోవడంతో నిరుపయోగంగా పడిందన్నారు. జలకనూరు నుండి గని వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, రైతులు వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.ు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కారం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు షేక్షావలి, రాముడు, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, సిద్దయ్య, పెద్ద నాగిరెడ్డి, ఉస్మాను, అలేకం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రి నందు నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భవ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిహెచ్సి వైద్యులు డాక్టర్ సాగరిక అన్నారు. శనివారం బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భవ వైద్య సేవలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ హైమావతి, ఇంద్రజ, జిడిఏ సులోచన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం దేవస్థానం భక్తులకు అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శనివారం ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కె. కాశీ విశ్వేశ్వర శర్మ రూ.1,00,200లను విరాళంగా దేవస్థానం పర్యవేక్షకులు ఎ.నాగరాజుకు అందజేశారు. దాతకు శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధిత ధ్రువ పాత్రలను అందజేసినట్లు అధికారులు తెలిపారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో, మూడవ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ వైద్యశాలలకు మహర్దశ కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, టంగుటూరు పిహెచ్‌సి వైద్యులు సోహెల్, పలుకూరు పిహెచ్‌సి డాక్టర్ లక్ష్మి, వైద్యులు శ్రీనివాస్ రెడ్డి, ఓ. లలిత, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, 6వ వార్డు మెంబర్ సురేష్, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు, పాల్గొన్నారు. **చాగలమర్రి :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని సర్పంచు బంగారు షరీఫ్ ,ఎంపిపి వీరభద్రుడు, ఎంపిటిసి లక్ష్మిరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంను వారు ప్రారంభించారు. తహశీల్దార్ సుభద్రమ్మ , ఎంపిడీవో మహబూబ్‌దౌలా, ఈఓఆర్‌డి సుదర్శన్ రావుల పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేసిఎస్ జిల్లా అధ్యక్షుడు బాబులాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ఎంఈఓ న్యాంతుల్లా, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ, సిహెచ్ఓ రమణమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటమ్మ, మనోహర్, లింగారెడ్డి, వైసిపి నాయకులు గౌస్‌పీరా, రామగురివిరెడ్డి, మనోహర్ రెడ్డి మహబూబ్‌బాష, జబ్బార్, బియ్యం షబ్బీర్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని కమ్మవారిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, ఎంపిడిఓ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. మండలంలోని వేంపెంట గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆర్థర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాత్రికేయులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు. వంటకాలను తిని రుచి చూశారు. మందులు, రక్త పరీక్ష కౌంటర్లను, ఒపిని పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఓ హనుమంతరావు నాయక్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక, సర్పంచి మాణిక్యమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మి, ఈవోఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపిపి వెంకటేశ్వర్లు, మండల వైద్య అధికారిని గులాబ్ షా, ఎంఇఒ బాలాజీ నాయక్, పశు వైద్యాధికారి భాస్కర్, సూపర్వైజర్ అంజలీదేవి, ఏపీవో విమలమ్మ, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, డైరెక్టర్ రామసుబ్బయ్య, నాయకులు భాస్కర్, దానమయ్య, జబ్బారు రాజన్న, స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో సర్పంచ్ మాదక్క, ఉప సర్పంచ్ సుధాకరప్ప ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హాజరై మాట్లాడారు. వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ నాయకులు మూర్తిజావలి, నాగరాజు, స్థానిక నాయకులు చలపతి రెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండల పరిధిలోని పెద్దకంబలూరు గ్రామంలో ఎంపీడీవో మధుసూదన రెడ్డి, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని కమ్మవారిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, ఎంపీడీవో జీవి ప్రసాద్ రెడ్డి, పెద్దవెంతుర్ల ఎస్ వెంకటేశ్వర రెడ్డి, కమ్మవారి పల్లి సర్పంచ్ కొండయ్య, పెద్దవేంతుర్ల సర్పంచ్ పద్మంజలి దేవి, ప్రభుత్వ వైద్య అధికారి రాజకుమార్ పాల్గొన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారానికి సంబంధించిన ప్రదర్శనను జిల్లా పరిషత్ చైర్మన్ పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీ భాస్కర్ రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు :** మండలంలోని పెద్ద దేవళాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సహకార సంఘం చైర్మన్ బూరం శివలింగం, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, తాసిల్దార్ రవికుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది, స్పెషల్ డాక్టర్లు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** మండలంలోని కొక్కెరంచ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీడీఓ మేరి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ రఘురాం, సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, ఉప సర్పంచు కరిముల్లా, వైసిపి నాయకుడు నాగరత్నం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** మండలంలోని పోలూరు గ్రామంలో సర్పంచి ప్రతాప్ , ఏంపిడిఓ సుగుణ శ్రీ, విస్తరణ అధికారి మహీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్నినిర్వహించారు. ముఖ్య అతిధిగా పిడి డ్వామా రామచంద్ర రెడ్డి పాల్గొని క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు. **నందికొట్కూర్ :** మండల పరిధిలోని కోనేటమ్మపల్లె గ్రామంలో రోగులకు అందిస్తున్న వైద్యం వివరాలను ఎంపిడిఒ శోభారాణి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి మాట్లాడారు. పబ్బతి రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్వో, సర్పంచ్ దామోదర్ రెడ్డి, ఈఓఆర్‌డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

రబీకి ఎరువుల కొరత లేదు

- జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రబీ సాగుకు సంబంధించి ఎరువుల కొరత లేదని, యూరియాతో సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం పీపీఎల్ కంపెనీకి చెందిన ఎరువుల వ్యాగన్ నంద్యాల రేక్ పాయింట్‌కు రావడంతో ఆయన ఏవో ప్రసాద్ రావుతో కలిసి రేక్ పాయింట్ వద్దకు వెళ్లారు. కంపెనీ సమర్పించిన ముందస్తు ఎరువుల పంపిణీ ప్రణాళికలో పొందుపరచిన డీలర్లకు ఎరువులు సరిగా వెళుతున్నాయ లేదా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీఎల్ కంపెనీకి సంబంధించి ఎరువుల వ్యాగన్‌లో 900 మెట్రిక్ టన్నుల యూరియా, 905 మెట్రిక్ టన్నుల డిఏపి, 710 టన్నుల 20.20.00.13 వచ్చిందని తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు 450 మెట్రిక్ టన్నుల యూరియా మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు కేటాయించామని, మిగిలిన 450 మెట్రిక్ టన్నుల ప్రైవేట్ డీలర్లకు కేటాయించామని వెల్లడించారు. జిల్లాలో రబీ పంట కాలం ప్రారంభం కావడంతో రైతులు ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారు కాబట్టి కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. 3 వేల టన్నుల క్రిబ్కో కంపెనీకి చెందిన వ్యాగన్ రేపు వస్తుందని, జిల్లాలో రైతులకు కావలసిన యూరియా ఆర్‌బికెలలో, డీలర్ల దగ్గర అందుబాటులో వుంటుందని తెలిపారు. జిల్లాలోని రైతులకు నానో యూరియా గురించి అవగాహనా కార్యక్రమాలు జరుగుతున్నాయని, నానో యూరియా వాడడం వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని, సులభంగా స్ప్రే చేసుకోవచ్చన్నారు. భూమి వాయు కాలుష్యము కూడా తగించవచ్చని, అందువలన ప్రతి రైతు నానో యూరియా వాడాలని తెలిపారు. అనంతరం ఆర్ కె ఎంటర్ప్రైజస్‌లో తనిఖీలు చేసి రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఏదైనా ఫిర్యాదులు వస్తే ఎఫ్‌సిఒ 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీపీఎల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్, హ్యాండ్లింగ్ ఆపరేటర్ మధుసూదన రావు, ఆర్‌కె ఎంటర్ప్రైజస్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

దళితులపై కొనసాగుతున్న దాడులు : కెవిపిఎస్

ప్రజాశక్తి - కొత్తపల్లి

దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలైనా దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలు సామాజిక న్యాయానికి నోచుకోవడం లేదని, నేటికీ కుల వివక్ష, అంటరానితనం, దాడులు, అత్యాచారాలను ఎదుర్కొంటున్నారని కెవిపిఎస్, వ్యకాసం నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామంలో కెవిపిఎస్ జెండాను ఎం.జ్ఞాన సూర్యుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు మాట్లాడారు. కార్యక్రమంలో చిన్న స్వాములు, ప్రభాకర్, అబ్రహం, మాజీ ఉపసర్పంచ్ నేరేడు స్వాములు, సంసోను, దైవ జ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

Before the Honourable Deputy Registrar of Chits by Arbitrater : Kurnool.
Dispute No. 79/2023

Between :
M/s. Sri Balaji Nandi Chits (P) Ltd., Nandyal .... Disputant
-Versus-
1) D. Ramaiah
2) C. Raja Reddy
3) B. Mallikarjuna .... Opponents

OPPONENTS 1 TO 3 NOTICES

1) D. Ramaiah, S/o. D. Ramanaiah, S.G. Asst., A.A.U.P. School, Abbipuram (V), Mahanandi (M), Nandyal (D).
2) C. Raja Reddy, S/o. C. Anthaiah Reddy, S.G. Teacher, RCM Aided Primary School, Maseedupuram (V), Mahanandi (M), Nandyal (D)
3) B. Mallikarjuna, S/o. B.Dharma Rao, Superintendent, O/o. The Asst. Pay & Accounts Officer, T.G.P. Compound, Tekke, Nandyal.

పై దావా నందు Disputant Company వారికి రావలసిన బాకీ మొత్తం 5,95,131/- రూపాయలు మరియు ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుండి 3 Opponents అయిన మీరు 27-10-2023వ తేదీన ఉదయం 11-00 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 27-10-2023

By order of the Deputy Registrar of Chits
By Arbitrater, Kurnool.

Before the Honourable Deputy Registrar of Chits by Arbitrater : Kurnool.
Dispute No. 80/2023

Between :
M/s. Sri Balaji Nandi Chits (P) Ltd., Nandyal .... Disputant
-Versus-
1) P. Aswani
2) P.V.V. Ramana Kumar
3) B. Khadar Basha .... Opponents

OPPONENTS 1 TO 3 NOTICES

1) P. Aswani, D/o. P. John moses, H.No. 26-330-E3, Viswasapuram, Behind LIC Office, Nandyal.
2) P.V.V. Ramana Kumar, S/o. P. Rama Subbaiah, School Asst (English), Z.P. High School (Boys), Kandimallayapalli (V), B. Mattam (M), YSR Kadapa (D)
3) B. Khadar Basha, S/o. B. Shabbir Ahmed, School Asst. (Hindi), Z.P. High School, Kandimallayapalli (V), B.Mattam (M), YSR Kadapa (D).

పై దావా నందు Disputant Company వారికి రావలసిన బాకీ మొత్తం 2,27,468/- రూపాయలు మరియు ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుండి 3 Opponents అయిన మీరు 27-10-2023వ తేదీన ఉదయం 11-00 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 27-10-2023

By order of the Deputy Registrar of Chits
By Arbitrater, Kurnool.